
పేదల చెంతకు 'ఫ్యామిలీ డాక్టర్'



గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని పీహెచ్‌సీల వైద్య బృందాలు మరింత ప్రతిష్టాత్మకంగా అమలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ల ద్వారా ఇప్పటికే సంబంధిత సమాచారాన్ని రప్పించుకుని నిక్షిప్తం చేసుకున్నారు. పీహెచ్‌సీలకు మూడు కిలోమీటర్ల దూరం దాటి ఉన్న గ్రామాలు, కాలనీల్లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో పీహెచ్‌సీ నుంచి సగటున 20 సచివాలయాల పరిధిలో ఈ సేవలను అందించనున్నారు. అంటే ఒక్కో సచివాలయ పరిధిలో నెలలో ఒకరోజు వెళ్లి వైద్యసేవలు అందిస్తారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు అందేదిలా..

నెలలో ఒక రోజు ఒక సచివాలయం పరిధిలో వైద్యుడితో సహా వైద్య బృందం సేవలను అందిస్తుంది. ఇక్కడ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ నిర్వహించి మధ్యాహ్నం నుంచి రోగుల ఇళ్లకు వెళ్లడం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి వైద్యసేవలను అందిస్తారు.


ఫ్యామిలీ డాక్టర్ సేవల్లో ఓపీ నిర్వహణ

ఉదయం ఇలా..

➡ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆ సచివాలయంలోనే వైద్యుడు ఓపీ నిర్వహిస్తారు.

➡ ఆ సమయంలో అక్కడ 104 అంబులెన్స్ అందుబాటులో ఉంటుంది. పూర్తిస్థాయిలో మందులను అందుబాటులో ఉంచుతారు. ఈ ఓపీలో 14 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తారు.

➡ ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, వార్డు హెల్త్ సెక్రటరీ సహాయంతో ఆ సచివాలయం పరిధిలోని గర్భిణులను ఓపీకి తీసుకొచ్చి అవసరమైన రక్త పరీక్షలతో పాటు బీపీ కూడా తనిఖీ చేస్తారు. రక్త హీనత ఉన్న గర్భిణులను గుర్తించి చికిత్స అందిస్తారు.

➡ గర్భ నిర్ధారణ పరీక్షలను కూడా అక్కడ నిర్వహించి అవసరమైన మందులను అందజేస్తారు.

➡ లెప్రసీ, టీబీ వ్యాధిగ్రస్తులను కూడా ఓపీకి రప్పించి, వారి ఆరోగ్య పరిస్థితులను సమీక్షిస్తారు. అవసరమైతే అదనపు మందులను కూడా అక్కడ ఇస్తారు.

మధ్యాహ్నం ఇలా..

సచివాలయం పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తారు. విద్యార్థులకు వివిధ రక్త పరీక్షలను నిర్వహిస్తారు. వారికి ఇప్పటికే అందజేసిన ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను ఎలా వాడుతున్నారన్న విషయంపై తనిఖీ చేస్తారు. ఈ సందర్భంగా ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. పోషకాహార లోపం, తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నవారిని గుర్తిస్తారు. అలా గుర్తించిన వారికి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా డబుల్ రేషన్ ఇచ్చేందుకు సిఫార్సు చేస్తారు.

రోగులకు ఇంటివద్దే వైద్యం (పాలెటివ్ కేర్)

➡ మంచంపైనే ఉండి లేవలేని రోగుల ఇళ్లకు వైద్యులు మధ్యాహ్నం పర్యటన సందర్భంగా వెళ్తారు. వారికి బీపీ, షుగర్, హెచ్‌బీ వంటి వైద్య పరీక్షలను నిర్వహిస్తారు. మంచంపైనే ఉండటానికి గల విషయాలపై కేస్ స్టడీలను చేపడతారు. వైద్య పరీక్షల అనంతరం రోగికి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తారు.

➡ ఆ నెలలో ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేయించుకొని డిశ్చార్జి అయిన రోగులను కూడా వారి ఇళ్లకు వెళ్లి పరీక్షిస్తారు. అదనపు వైద్యం అవసరాన్ని నిర్ధారించి అవసరమైన చర్యలను చేపడతారు.

మూడు నుంచి ఐదు కేసులు

ఫ్యామిలీ డాక్టర్ అనేది చాలా మంచి కార్యక్రమం. మంచంపై ఉండి కదల్లేనివారి ఇళ్లకు డాక్టర్లు వెళ్లి సేవలు అందించడంతో రోగులు చాలా స్వాంతన ఫీలవుతారు. ఇలాంటి కేసులు ఒక్కో సచివాలయం పరిధిలో సగటున మూడు నుంచి ఐదు కేసులు ఉంటాయని భావిస్తున్నాం. ఇప్పటికే మేము రెడ్డి తుంగ్లాంలో ఈ కార్యక్రమం నిర్వహించాం. అక్కడ మేము మూడు కేసులను గుర్తించాం.

– డాక్టర్ వై.రామకృష్ణ, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి

వినియోగదారుని విజయం

గాజువాక : తయారీలో లోపం గల ఒక వస్తువును కొనుగోలు చేసిన వినియోగదారురాలు ఆ కంపెనీ నుంచి తిరిగి కొత్త వస్తువును పొందడంలో విజయం సాధించిన ఘటన గాజువాకలో జరిగింది. వాంబే కాలనీకి చెందిన లక్ష్మి అనే మహిళ స్థానిక అయ్యప్ప హోమ్ అప్లయన్సెస్ వద్ద గతేడాది డిసెంబర్ 12న స్పిన్ మాప్ పరికరాన్ని కొనుగోలు చేశారు. తయారీలో లోపంవల్ల అది కొనుగోలు చేసిన నెలరోజులకే పాడైపోయింది. దీంతో ఆమె ప్రెస్టీజ్ సర్వీసింగ్ సెంటర్, అయ్యప్ప హోమ్ అప్లయన్సెస్ దృష్టికి తీసుకెళ్లగా, తాము వారంటీ ఇవ్వలేమని, కస్టమర్ కేర్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయండని బదులిచ్చారు. దీంతో ఆ పరికరాన్ని నగరంలోని సర్వీసింగ్ సెంటర్‌కు తీసుకెళ్లి చూపించారు. రిపేర్ చేయడానికి అవకాశం లేదని వారు చెప్పడంతో ఆమె గాజువాకలోని విశాఖ కన్జూమర్ రైట్స్ అధ్యక్షుడు పి.వి.నాగేశ్వరరావును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఆయన కంపెనీకి, అమ్మిన వ్యక్తికి నోటీసులు పంపించారు. దీంతో వారు ఆ వినియోగదారురాలికి కొత్త పరికరాన్ని అందించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. ఈ విషయంలో తమకు సహకరించిన కన్జూమర్ రైట్స్ సభ్యులు డి.బాలమణి, ఎర్రమ్మ, సాయిలక్ష్మి తదితరులను అభినందించారు.


వినియోగదారురాలికి కొత్త మాప్ పరికరాన్ని అందజేస్తున్న నాగేశ్వరరావు

'స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడం సరికాదు'

కూర్మన్నపాలెం: ప్రగతి పథంలో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే నిర్వీర్యం చేస్తున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. ప్లాంట్ జోలికొస్తే సహించబోమని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 786వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని ఆర్.ఎం.హెచ్.పి మరియు ఏసీఎస్ హెచ్‌ఆర్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన ప్లాంట్‌కు ముడి సరుకు అందించకుండా చేసి, 1300 కోట్ల నష్టాల వైపు నెట్టారని విమర్శించారు. తెలుగు ప్రజల బలమైన ఆకాంక్ష అయిన విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే విధంగా రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


786వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

క్లుప్తంగా

పెంటమాంబ పండగకు ఆహ్వానం


మంత్రి అమర్‌నాథ్ మాతృమూర్తికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న కమిటీ నాయకులు

పెదగంట్యాడ: నెల్లిముక్కు పంచాయతీ 14 గ్రామాల దేవత పెంటమాంబ అమ్మవారి పండగను ఈ నెల 10న జరిపించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పండగకు హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణికి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి శనివారం ఆహ్వాన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, సుమన్ రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింగరావు

గాజువాక : విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 15న మధ్యాహ్నం రెండు గంటలకు గాజువాకలో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఎస్‌ఏడీ, కరాస మీదుగా బీచ్ రోడ్‌లోని పార్కు హోటల్ వరకు, అక్కడి నుంచి కాళీమాత ఆలయం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు బాటా శ్రీను, కట్ట పద్మ, పేర్ల అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్న దానానికి రూ. లక్ష విరాళం


దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విశాఖపట్నం రాజీవ్‌నగర్‌కు చెందిన పి.రాధాకృష్ణ కుటుంబం రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. శనివారం ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్న వారు ఆలయ అధికారులను కలిసి పి. మేధాఅశ్విన్‌సాయి పేరిట నిత్యాన్నదానానికి రూ. 1,00,011 విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

చికిత్స పొందుతూ మేస్త్రి మృతి


మృతుడు పైడిరాజు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: కరెంట్ షాక్‌తో తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మేస్త్రి గొంపా పైడిరాజు(54) శనివారం మృతి చెందారు. 69వ వార్డు చుక్కవానిపాలెంలో రోడ్డు పక్కన నిర్మాణాలు చేపడుతున్న సమయంలో కాపు జగ్గరాజు పేటకు చెందిన గొంపా పైడిరాజు శుక్రవారం కరెంట్ షాక్‌కు గురై, తీవ్ర గాయాల పాలైన సంగతి విదితమే. పైడిరాజుకు ముందుగా పీలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు గాజువాక పోలీసులు తెలిపారు. గాజువాక ఎస్‌ఐ టి.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, పెళ్లయిన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

జగనన్నతోనే ఉజ్వల భవిష్యత్తు

• ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
• వాడవాడలా ఉత్సాహంగా
• 'మా నమ్మకం నువ్వే జగన్'


69వ వార్డు నాతయ్యపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


65వ వార్డులో మహిళకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అందిస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు


ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ చందు తదితరులు


మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే ఈ రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆయనకు తోడుగా ఉండి, మీ బిడ్డల భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని 69వ వార్డు నాతయ్యపాలెంలోని సీఎస్‌ఆర్ కల్యాణమండపంలో ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ పేదల పక్షాన నిలబడి పాలన అందిస్తున్నారన్నారు. చంద్రబాబులాగా ఒక వర్గానికే పదవులు, అధికారం ఇస్తూ జన్మభూమి కమిటీలతో ఎలా పాలన సాగించారో అందరికీ తెలిసిందేనన్నారు. ఈ భేదాన్ని గుర్తించి, జగనన్నకు అండగా నిలవాలని కోరారు. అనంతరం గృహ సారథులు, కన్వీనర్లతో కలిసి నాతయ్యపాలెంలో ఇంటింటికీ తిరిగారు. విద్యార్థులు ఎమ్మెల్యేకు హారతులు పట్టారు. జగనన్న పరిపాలనపై విద్యార్థినుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎమ్మెల్యే వారి ఇంటికి స్టిక్కర్‌ను అంటించారు. వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎస్.ఎం.డి.గౌస్, బీసీ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, నాయకులు గంధ్రెడ్డి రామునాయుడు, కమరున్నీసా బేగం, సంధ్రాన చిన సన్యాసిరావు, మళ్లా కుమార్, విరోతి రాము, కాకి అప్పల రెడ్డి, సాలాపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

➠ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనపై మహిళల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వారికి సెల్ ఫోన్‌పై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. నాయకులు వరదాడ వెంకటరమణ, సంధ్రాన నూకరాజు, నంబారు రాజు, తెంటు గోపాలరావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సందర్భంగా 70వ వార్డు ఎల్‌బీఎస్ నగర్ సచివాలయం పరిధిలో కార్పొరేటర్ ఉరుకూటి చందు పర్యటించారు. జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నీలాతి అచ్చిబాబు, వేపాడ శ్రీను, మిలియన్ తాతారావు, కొణతాల రాము పాల్గొన్నారు.

➠ 67వ వార్డు గణేష్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. భావితరాలకు మంచి భవిష్యత్ కోసం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు ఎస్‌ఎండీ గౌస్, ఎం.డి.సాహిద్, గవరమ్మ, అమ్మాజీ, ఆదిబాబు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా అపూర్వ ఆదరణ

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో నడుపూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. ప్రజల అనుమతితో వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. పల్లా చినతల్లి, మంత్రి శంకర నారాయణ, పరాంకుశం ప్రమీల, కాకినాడ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

➠ 65వ వార్డు భానోజీతోట, ప్రియదర్శిని కాలనీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, వికాస్‌నగర్‌లో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పెద్దింటి మంగునాయుడు, జుత్తు లక్ష్మి, దేముడు, పెండ్ర రాజు, మంత్రి మంజుల పాల్గొన్నారు.

➠ 73వ వార్డు చిననడుపూరులో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఇంటింటికీ వెళ్లి, ప్రజల మద్దతు కూడగట్టారు. వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని కోరారు.

➠ 75వ వార్డు సీతానగరం ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, గొందేశి వెంకటరమణారెడ్డి, పిట్టా రెడ్డి, ప్రదీప్ చంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

అగనంపూడి: 88వ వార్డు వెదుళ్లనరవలో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనక మహాలక్ష్మీనాయుడు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. మాజీ కార్పొరేటర్ బొప్పా నాగరాజు, నాయకులు సర్వసిద్ధి బోరయ్యనాయుడు, చట్టి తాతారావు, శేఖరమంత్రి శ్రీనివాస్ పట్నాయక్, ఎం.అప్పారావు, పల్లా చిన్న తదితరులు పాల్గొన్నారు.

➠ 79వ వార్డు అగనంపూడి పరిసర కాలనీల్లో మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. సచివాలయ కన్వీనర్లు మామిడి శ్రీను, నెల్లి శ్రీనమ్మ, తమ్మిన శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: 87వ వార్డు ఎరుకులవీధి సచివాలయ పరిధిలో మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సుపరిపాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ముద్దపు దామోదర్, ఎన్నేటి రమణ, సీహెచ్.వి.రమణ, దుగ్గపు దానప్పలు పాల్గొన్నారు.

➠ యాదవ్‌జగ్గరాజుపేట సచివాలయ పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు.

➠ 87వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతి ఇంటిని సందర్శించారు. ఇంటి గోడలపై స్టిక్కర్లను అతికించారు. శీరపు పాపారావు, కోనేటి పారిపల్లి, వడ్లపూడి ఈశ్వరరావు, పెద్దిన రమణ తదితరులు పాల్గొన్నారు.


వెదుళ్లనరవలో మహిళకు స్టిక్కర్ అందిస్తున్న 88వ వార్డు ఇన్‌చార్జి మహాలక్ష్మినాయుడు


76వ వార్డు నడుపూరులో స్టిక్కర్ అతికిస్తున్న దేవన్‌రెడ్డి


ప్రజల అభిప్రాయం తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో గోడకు స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

'మిషన్ వాత్సల్య'పై అవగాహన


పథకంపై అంగన్‌వాడీలో అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

అగనంపూడి: అనాథ బాలలు, తల్లి లేదా తండ్రి లేని వారు, సంరక్షణ లేని 18 సంవత్సరాల లోపు బాలలకు కేంద్ర ప్రభుత్వం ప్రతీనెలా రూ.4వేలను అందిస్తుందని రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు ఎ.ఈశ్వరరావు తెలిపారు. అర్హులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. 79, 85 వార్డు బీజేపీ కమిటీల ఆధ్వర్యంలో నిర్వాసిత కాలనీ అంగన్‌వాడీ కేంద్రా ల్లో మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన కల్పించా రు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. అనాథలతో పాటు తల్లి లేదా తండ్రి లేని వారికి కూడా అర్హత ఉందని, అటువంటి వారు తమ దరఖాస్తులను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తే, వాటిని ఐసీడీఎస్ ద్వారా పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కోసూరి తాతారావు, వెయ్యాకుల శంకరరావు, కె.కుమారి, ఉక్కు కార్మిక సంఘం నాయకులు బి.సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా రంగానికి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. 76వ వార్డు నడుపూరు ఎంపీపీ పాఠశాలలో రూ.58 లక్షలతో నిర్మించనున్న భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్పొ రేటర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, నాయకులు మంత్రి శంకరనారాయణ, జగదీష్ పాల్గొన్నారు.

భానోజీతోటలో బీజేపీ బూత్ కమిటీ ఏర్పాటు

గాజువాక : 65వ వార్డు భానోజీతోటలో బీజేపీ బూత్ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కె.నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా సమ్మిడి రంజిత్ కుమార్, వెంకట నారాయణ నియమితులయ్యారు. మరో 11 మందితో బూత్ కమిటీని ఏర్పాటు చేశారు. నర్సింగరావు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీలోగా నియోజకవర్గంలోని అన్ని బూత్‌లకు కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సుహాసిని, రాహుల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో డీఎంహెచ్‌వో తనిఖీ

అగనంపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలు, బాలింతలు, గర్భిణులకు సరిపడా మందులు నిల్వ ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. అగనంపూడిలోని ప్రశాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బాలలు రక్తహీనతతో బాధపడకుండా ఈ బిళ్లలు తప్పనిసరిగా వాడేలా చూడాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన మందులు అందుబాటులో ఉండచుకోవాలని ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందికి ఆదేశించారు. హైరిస్క్ ఉన్న గర్భిణులకు హెచ్‌బీ శాతం పరీక్షించి రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఎన్‌సీడీసీడీ సర్వే సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. ముందుగా లంకెలపాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ రమణారెడ్డి, డీపీఎంవో శశిభూషణ్, డీపీఏ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


అగనంపూడి అంగన్‌వాడీ కేంద్రంలో మందులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

'ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి'


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి మద్దతును కూడగట్టాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కోరారు. మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయన తన కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించా లని సూచించారు. సమావేశంలో వార్డు నాయకుడు ఎన్.వై.నాయుడు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న వంశీరెడ్డి, దేవన్‌రెడ్డి, న్యూపోర్టు సీఐ రాము

పెదగంట్యాడ: జన్మదినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు దర్మాల శ్రీను జన్మదిన వేడుకలను వెంకన్నపాలెంలోని పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, న్యూపోర్టు సీఐ రాము, నాయకులు మార్టుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, గొందేశి వెంకటరమణారెడ్డి, నక్క వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.